సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం, 1, జూన్, 2024



సోమశిలలో 7.415 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 7.415 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్‌డెల్టాకు 200, ఉత్తరకాలువకు 5, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.74,580
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,680
3 శాతం జీఎస్టీతో	రూ.6,880
నవర (8 గ్రా)	రూ.55,040



సందడే.. సందడి

రామాయపట్నం తీరానికి భక్తులు శుక్రవారం పోటెత్తారు. గురువారం రాత్రి తెట్టులో జరిగిన గంధమహోత్సవానికి వచ్చిన భక్తులు తీరంలో స్నానాలు ఆచరించారు.

10లో

న్యూస్‌రీల్

నేటి నుంచి పింఛన్ల నగదు పంపిణీ

- 2,28,471 మందికి బ్యాంకు అకౌంట్లకు జమ
- 85,951 మందికి ఇంటి వద్దనే అందజేత

నెల్లూరు(పొగతోట): సామాజిక పింఛన్ల నగదు పంపిణీ ప్రక్రియకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 3,14,422 మంది లబ్ధిదారులు ఉన్నారు. సుమారు రూ.96 కోట్ల నగదు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 2,28,471 మంది లబ్ధిదారులకు వారి బ్యాంకు అకౌంట్లలో నగదు జమ చేయనుండగా, 85,951 మంది లబ్ధిదారులకు ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది నగదు అందజేయనున్నారు. దివ్యాంగులు, మంచం మీద ఉన్న వారు, నడవలేని వారు, వైద్యసేవలు పొందుతున్న లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయనున్నారు. లబ్ధిదారులు బ్యాంకుల వద్ద నగదు డ్రా చేసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు పింఛన్ల నగదు పంపిణీ చేయనున్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 331

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ. 331 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 742 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 606 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. 136 బేళ్లను వివిధ కారణాలతో కొనుగోలు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్టంగా రూ.331, కనిష్టంగా రూ. 205 ధర లభించగా, సగటున రూ. 289.04 ధర లభించిందన్నారు. వేలంలో 15 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో 774 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం 774 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 879 బేళ్లు రాగా 774 బేళ్లు విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 93,954 కిలోల పొగాకును విక్రయించగా రూ.25296687 వ్యాపారం జరిగింది. వేలంలో గరిష్టంగా రూ.334, కనిష్టంగా రూ.205 ధర లభించింది. సగటున రూ.269.24 ధర నమోదైంది. వేలంలో 22 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు జూనియర్ కళాశాలల పునః ప్రారంభం

నెల్లూరు (టౌన్): వేసవి సెలవుల అనంతరం శనివారం నుంచి జూనియర్ కళాశాలలు పునః ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి జూనియర్ కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 186కు పైగా ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో సుమారు 60 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. కళాశాలలు పునః ప్రారంభం కానుండడంతో విద్యార్థులు కళాశాలలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. కొన్ని కళాశాలల యాజమాన్యాలు మాత్రం సోమవారం నుంచి తరగతులను ప్రారంభించే విషయంలో ఉన్నట్లు తెలిసింది.

బడి బస్సు.. ఫిట్‌లెస్సు

జిల్లాలో విద్యా సంస్థలు సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నాయి. ఫీజులు, బస్సు చార్జీల పేరుతో విద్యార్థుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్న యాజమాన్యాలు బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకునే విషయంలో అలవికాని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. జూనియర్ కళాశాలల బస్సులకు మే ఆఖరితో ఎఫ్‌సీ గడువు పూర్తయితే.. పాఠశాలల బస్సులకు మరో పన్నెండు రోజులు గడువు ఉంది. అయితే ఇంత వరకు 25 శాతం బస్సులకు మాత్రమే యజమాన్యాలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాయి. జూన్ 1వ తేదీ నుంచి జూనియర్ కళాశాలలు, 12వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఫిట్‌నెస్‌పై యాజమాన్యాల నిర్లక్ష్యంపై కొరడా ఝుళిపించేందుకు రవాణాశాఖ అధికారులు సిద్ధమయ్యారు.



బస్సును తనిఖీ చేస్తున్న రవాణాశాఖాధికారి (ఫైల్)

- ఎఫ్‌సీ గడువు ముగిసినా.. పట్టని యాజమాన్యాలు
- మే 31 కళాశాలలు, జూన్ 12 వరకు పాఠశాలల బస్సుల ఎఫ్‌సీ గడువు
- నిర్లక్ష్యంగా విద్యాసంస్థల యాజమాన్యాలు
- ఎఫ్‌సీ లేకుండా రోడ్డుపైకి వస్తే సీజ్ చేస్తామంటున్న రవాణా అధికారులు

నెల్లూరు (టౌన్): బస్సులను కండిషన్ ఉంచుకునేందుకు విద్యా సంస్థల యాజమాన్యాలు నిర్లక్ష్యం కనబరుస్తున్నాయి. బస్సులకు ఫిట్‌నెస్సా తర్వాత చూసుకుందాం అనే ధోరణిలో వ్యవహరిస్తున్నాయి. చిన్నారులను భద్రంగా బడికి తీసుకెళ్లాల్సిన బస్సుల కండిషన్‌ను ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు పట్టించుకుంటున్న దాఖలాలు కనబడడం లేదు. జిల్లాలో మొత్తం 1,517 విద్యా సంస్థల బస్సులు ఉంటే ఇప్పటి వరకు కేవలం 25 శాతం బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాయి. కండిషన్‌లో లేని 71 బస్సులను అధికారులు రిజెక్ట్ చేశారు. ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కితే బస్సులను సీజ్ చేస్తామని ఓ వైపు రవాణా అధికారులు హెచ్చరిస్తున్నా విద్యాసంస్థల యాజమాన్యాలు పెడ చెవిన పెడుతున్నాయి. జూనియర్ కళాశాలలకు మే 31, పాఠశాలల బస్సులకు జూన్ 12వ తేదీతో ఫిట్‌నెస్ గడువు ముగిస్తోంది. కళాశాలలు శనివారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి.



బస్సు కండిషన్‌పై డ్రైవింగ్ చేస్తున్న ఎంవీఐ బాల మురళీకృష్ణ, ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్

జిల్లాలో మొత్తం బస్సులు 1,517	కండిషన్‌లో లేక తిరస్కరణకు గురైనవి 71
ఫిట్‌నెస్ పొందినవి 379	

నిబంధనలు ఏంటంటే ...

విద్యాసంస్థ బస్సుల నిబంధనలపై రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబరు 185ను విడుదల చేసింది. ఈ జీఓ ప్రకారం ప్రతి యాజమాన్యం విద్యాసంస్థల బస్సులకు 32 రకాల నిబంధనలను అమలు చేయాలని జీఓలో పేర్కొన్నారు.

- ప్రతి ఏటా విద్యా సంవత్సరానికి ప్రారంభం ముందే ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను పొందాలి.
- డ్రైవర్లకు హెవీ లైసెన్స్ కలిగి ఉండి ఐదేళ్ల అనుభవం కలిగి ఉండాలి. 60 ఏళ్లకు పైబడి ఉండకూడదు.
- డ్రైవర్లకు ఆరోగ్య కార్డులు ఉండాలి. బీపీ, షుగర్, కంటి ఫిట్‌నెస్‌ను పొందుపరచాలి.
- డ్రైవరు ఖాకీ దుస్తులను తప్పని సరిగా ధరించాలి.
- అత్యవసర సమయాల్లో పిల్లలకు బయటకు వచ్చేందుకు ప్రత్యేక ద్వారం ఉండాలి.
- బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సును తప్పనిసరిగా అమర్చాలి. కాటన్, హైడ్రోజెన్ పెరాక్సైడ్, తదితర మందులను అందుబాటులో ఉంచాలి
- ప్రతి బస్సులో ఒక డ్రైవర్‌తో పాటు ఒక సహాయకుడు ఉండాలి.
- బస్సులో సేఫ్టీ ఫైర్ కిట్ ఉండాలి
- బస్సు పక్కల ఒక వైపు పాఠశాల అడ్రస్, ఫోన్ నంబరును రాయాలి.
- ప్రతి బస్సులో ఫిర్యాదులు కోసం ఒక రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలి. ఫిర్యాదులను ప్రతి రోజు ప్రిన్సిపల్ పరిశీలించాలి.
- బస్సు ఇంజిన్‌తో పాటు టైర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాల్సి ఉంది.
- సీట్లు ఉన్న వరకే విద్యార్థులను ఎక్కించుకోవాలి. ఏ విద్యార్థి నిలబడకూడదు.
- పాఠశాల, కళాశాలలోనే బస్సుకు పార్కింగ్ ప్రదేశం కేటాయించాలి.
- ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పేర్కొన్న విధంగా విద్యాసంస్థ బస్సు డ్రైవరు, అటెండర్ యూనిఫాంను విధిగా ధరించాలి.

జిల్లాలో 379 బస్సులకు ఫిట్‌నెస్

జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,517 విద్యా సంస్థల బస్సులు ఉన్నాయి. వీటిల్లో ఇప్పటి వరకు 379 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను తీసుకున్నారు. ఇంకా 1,138 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంది. ఫిట్‌నెస్‌కు తీసుకువచ్చిన బస్సుల కండిషన్‌లో లేవని జిల్లాలో మొత్తం 71 బస్సులను రిజెక్ట్ చేశారు. జిల్లాలో నెల్లూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు ప్రాంతాల్లో రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఒక్కో ఎంవీఐ రోజుకు 10 బస్సుల వరకు పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేయవచ్చు. ఈ కార్యాలయాల పరిధిలో ఎనిమిది మంది ఎంవీఐలు రోజుకు 10 బస్సుల లెక్కన 80 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీ చేగలరు. ఈ రోజుకు ఈ రోజు ఫిట్‌నెస్‌కు బస్సులు తెచ్చినా.. కళాశాలలు, స్కూళ్లు తెరిచే లోగా ఒక్కసారిగా వాటిని సర్టిఫై చేయడం సాధ్యమా?

ప్రాంతం	మొత్తం బస్సులు	ఫిట్‌నెస్ పొందిన బస్సులు	ఫిట్‌నెస్ లేని బస్సులు
నెల్లూరు	1,043	262	781
కావలి	247	61	186
కందుకూరు	99	24	75
ఆత్మకూరు	128	32	96

ఎఫ్‌సీ లేకుంటే బస్సు సీజ్



విద్యాసంస్థలబస్సులకు త్వరగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలి. ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా బడి బస్సులపై తనిఖీలు నిర్వహిస్తాం. ఫిట్‌నెస్ లేకుండా బస్సు రోడ్డుపైకి వస్తే ఆ బస్సును సీజ్ చేస్తాం. ఆ విద్యాసంస్థ యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకుంటాం. ప్రతి బస్సు కండిషన్‌లో ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బస్సును మెయింటెనెన్స్ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 71 బస్సులను కండిషన్ సరిగా లేదని వెనక్కి తిప్పి పంపాం. వారు మళ్లీ కండిషన్‌గా తీసుకవస్తే ఫిట్‌నెస్ సర్టిఫికేట్ జారీ చేస్తాం. ఫిట్‌నెస్ లేని వాటిల్లో 15 ఏళ్లు నిండిన బస్సులు ఉన్నాయి. విద్యాసంస్థలు తిప్పే ఏ బస్సు అయినా 15 ఏళ్ల వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. – మురళీమోహన్, ఇన్‌చార్జి ఆర్టీఓ, రవాణాశాఖ

జిల్లా అంతటా నాలుగు రోజులు నిషేధాజ్ఞలు

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (అర్బన్): ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ఈ నెల 3 ఉదయం 6 నుంచి 6 వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు జిల్లా అంతటా 144 సెక్షన్ (నిషేధాజ్ఞలు) విధిస్తున్నట్టు కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం తెలిపారు. ఐదుగురి కన్నా ఎక్కువ మంది గుమికూడి ఉండడం తగదన్నారు. చట్ట విరుద్ధమైన సమావేశాలు, బహిరంగా సభలు నిర్వహించరాదన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కౌంటింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు

రోజు వారి తనిఖీల్లో భాగంగా కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం సాయంత్రం కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 4న జరుగుతున్న ఎన్నికల కౌంటింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు చేశామన్నారు. 1,100 మంది ప్రత్యక్షంగా, 2,500 మంది పరోక్షంగా ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారన్నారు. కౌంటింగ్‌కు మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్‌కు సమీపంలోనే ఉన్న జెడ్పీ హైస్కూల్లో పార్కింగ్‌కు సైన్ బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి కేవలం అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారులకు మాత్రమే సెల్‌ఫోన్ అనుమతి ఉంటుందన్నారు. మిగతా వారెవరికి సెల్‌ఫోన్ అనుమతించేది లేదన్నారు. మీడియా ప్రతినిధులు మీడియా కేంద్రం నుంచే సెల్ ఫోన్ వినియోగించుకోవాలన్నారు. సజావుగా ఎన్నికల కౌంటింగ్ పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. కలెక్టర్ వెంట ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, రిటర్నింగ్ అధికారులు వికాస్‌మర్మత్, సేతు మాధవన్, విద్యాధరి, మలోల, మధులత, శీనానాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్, ఈవీఎం కేంద్రాల వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

'పద్మ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో అర్హులైన క్రీడాకారుల నుంచి 'పద్మ అవార్డు' పేరుతో సత్కరించేందుకు భారత ప్రభుత్వం నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే ఎతిరాజ్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో అర్హులైన క్రీడాకారులు www. padmaawards. gov. in వెబ్‌సైట్‌లో పొందుపరిచిన మార్గదర్శకాలకు అనుగుణంగా తమ దరఖాస్తులను నింపిన వర్డ్, పీడీఎఫ్‌లను sportsinap@gmail. com లేదా incentives.schemes@gmail. com మెయిల్ అడ్రస్‌కు 01.08.2024 తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పంపాలన్నారు. వివరాలు, దరఖాస్తుల కోసం ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని ఎతిరాజ్ తెలిపారు.

ముగిసిన పది పరీక్షలు

నెల్లూరు (టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు సోషల్ పరీక్షకు 2,625 మంది హాజరు కావాల్సి ఉండగా 1,150 మంది మాత్రమే హాజరయ్యారు. 1,475 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో 15 కేంద్రాల్లో డీఈఓ, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు.

ఆమెదే 'తీర్పు'

- జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో మహిళల పోలింగ్ అధికం
- వైఎస్సార్‌సీపీకే అనుకూలమంటున్న విశ్లేషకులు

ఆత్మకూరు: ప్రతిష్టాత్మకంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళలే నిర్ణేతలుగా 'తీర్పు' ఇవ్వనున్నారు. గత నెల 13వ తేదీ జరిగిన పోలింగ్‌లో జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఉదయగిరి తప్ప మిగతా 7 నియోజకవర్గాల్లో మహిళలు అత్యధికంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో మొత్తంగా 15,48,183 మంది ఓటు హక్కు వినియోగించుకుంటే.. ఇందులో 7,84,219 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా కోవూరు నియోజకవర్గంలో 1,08,879 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకుని అగ్రస్థానంలో నిలిచారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వారిని ప్రోత్సహిస్తున్న క్రమంలో వారు సైతం తమ కృతజ్ఞతను ఓట్ల రూపంలో ప్రభుత్వానికి అనుకూలంగా వేసి తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేలా దోహదపడ్డారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మహిళలతో పాటు నూతనంగా ఓటు హక్కు వచ్చిన యువతులు సైతం పోలింగ్ కేంద్రానికి ఉదయమే చేరుకొని తమ ఓటును తొలిసారి వినియోగించుకొనేందుకు ఉత్సాహంగా రావడం విశేషం.



ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధిక సంఖ్యలో వచ్చిన మహిళలు (ఫైల్)

నియోజకవర్గాల వారీగా పోల్ అయిన మహిళల ఓట్లు	
కోవూరు	1,08,879
కందుకూరు	1,02,394
కావలి	1,00,140
ఆత్మకూరు	90,974
నెల్లూరు టౌన్	87,314
నెల్లూరు రూరల్	97313
ఉదయగిరి	98,554
సర్వేపల్లి	98,651

పసిడి.. పట్టుబడి..

తెలుగు రాష్ట్రాల్లో 'జీరో' ట్యాక్స్ వ్యాపారం జోరుగా సాగుతోందని రెండు రోజుల వ్యవధిలో బిల్లులు లేకుండా తరలిస్తూ భారీగా పట్టుబడిన పసిడితో తేటతెల్లమవుతోంది. ఎన్నికల వేళ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతో పాటు టోల్‌ప్లాజాల వద్ద, మధ్య మధ్యలో ఏర్పాటు చేసిన ఎన్నికల తనిఖీ కేంద్రాల్లో నిఘా పెరిగింది. కొద్ది నెలలుగా స్తబ్దుగా ఉన్న బంగారం వ్యాపారులు తాజాగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. పోలింగ్ ముగిసిన తర్వాత చాలా చోట్ల చెక్‌పోస్టులు తీసేయడంతో అక్రమ లావాదేవీలు ఊపందుకుంటున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- టోల్‌ప్లాజాల వద్ద భారీగా బంగారం, నగదు స్వాధీనం
- రెండు రోజుల్లో 8.828 కేజీల బంగారం, రూ.1.62 కోట్ల నగదు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం

కావలి: గూడూరు, ఒంగోలు మధ్య మూడు టోల్‌ప్లాజాల వద్ద రెండు రోజుల వ్యవధిలో భారీ స్థాయిలో బంగారం పట్టుబడడం సంచలనంగా మారింది. ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమంగా బంగారం తరలిస్తున్నారంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో 'జీరో' ట్యాక్స్ దందా జరుగుతుందని స్పష్టమవుతోంది. రెండు రోజులుగా తెలంగాణకు చెందిన వ్యక్తులు ఎలాంటి పత్రాలు లేకుండా కేజీల కొద్ది బంగారాన్ని తరలిస్తుండగా టోల్‌ప్లాజాల వద్ద పట్టుబడిన విషయం విదితమే. జిల్లాలోని గౌరవరం, వెంకటాచలంతో పాటు టంగుటూరు టోల్‌ప్లాజాల వద్ద రెండు రోజుల్లో రూ.6.59 కోట్ల విలువైన 8.828 కేజీల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలింగ్ తర్వాత ఇంత పెద్ద మొత్తంలో అక్రమంగా తరలిస్తున్న బంగారం, నగదు పట్టుబడటం కలకలం రేపుతోంది.

అంతా మిర్యాలగూడ వాసులే..

కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ, కావలి రూరల్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం వేకువ జామున వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, కార్లలో తనిఖీలు నిర్వహించగా తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ నుంచి చెన్నై వెళ్తున్న నలుగురు మహిళల నుంచి రూ.1.62 కోట్ల డబ్బుతో పాటు చెన్నై నుంచి మిర్యాలగూడ వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 1.500 కేజీల బంగారం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. బుధవారం రాత్రి టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద కారులో అక్రమంగా తరలిస్తున్న 1.23 కేజీల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద సీఐ అంకమరావు వాహనాలు తనిఖీ చేస్తుండగా తెలంగాణకు చెందిన ఇద్దరు వ్యక్తులు తమ కారులో 1.658 కేజీల బంగారాన్ని తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. గౌరవరం, వెంకటాచలం, టంగుటూరు టోల్‌ప్లాజాల వద్ద నగదు, బంగారం తరలిస్తూ పట్టుబడిన వ్యక్తులంతా తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన వ్యక్తులే కావడం గమనార్హం. దీంతో వీరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున కావలి రూరల్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా చెన్నై నుంచి మర్వాడీలు కారు సీటు కింద సీక్రెట్ లాకర్లలో తరలిస్తున్న సుమారు 2.94 కేజీల బంగారు బిస్కెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం ఉదయం ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీ చేపట్టి చెన్నైకు చెందిన ఇద్దరు మర్వాడీల నుంచి 1.5 కిలోల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం గౌరవరం, వెంకటాచలం ప్లాజా వద్ద పట్టుబడిన బంగారం తెనాలికి తరలిస్తున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. దీన్ని బట్టి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా చేసే 'జీరో' బిజినెస్ దందాలో భాగంగా అక్రమంగా నగదు, బంగారం తరలిస్తూ పట్టుబడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజుల వ్యవధిలోనే ఇంత పెద్ద మొత్తంలో బంగారం, డబ్బు పట్టుబడటంపై పోలీసు వర్గాలే ఆశ్చర్యపోతున్నాయి.

చెన్నై నుంచి వెళ్లే వాహనాల తనిఖీలు నిల్..

ఇన్నాళ్లు పోలీస్, సెబ్ అధికారులు విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి తమిళనాడు, కర్ణాటక వైపు వెళ్తున్న వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిపై దృష్టి సారించి విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. అయితే తాజా తనిఖీల్లో చెన్నై నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు బంగారం తరలిస్తున్న విషయం బట్టబయలైంది. ఇన్నాళ్లు చెన్నై నుంచి వెళ్లే వాహనాలను తనిఖీ చేయకపోవడంతో పన్నులు చెల్లించకుండా అక్రమంగా పెద్ద ఎత్తున బంగారం తరలించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. తాజాగా వెలుగుచూసిన బంగారం అక్రమ రవాణా వ్యవహారంతో పోలీసులు, ఆదాయపన్ను అధికారులు అప్రమత్తం అవుతున్నారు.

క్లుప్తంగా

పొగాకు ఉత్పత్తులతో అనర్థాలు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ తదితరులు

నెల్లూరు(అర్బన్): పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తే కేన్సర్, గుండెపోటు లాంటి తీవ్రమైన రోగాలు వస్తాయని డీఎంహెచ్ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సంతపేటలోని డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీని వైద్య ఉద్యోగులు శుక్రవారం నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పొగాకుకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని కోరారు. తొలుత పొగాకుతో సంభవించే అనర్థాలను వివరించే పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా టీబీ, ఎయిడ్స్ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ, ఎన్సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, డెమో అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు సిటీ: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన రూరల్ మండలంలోని ఆమంచర్లలో శుక్రవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ఆమంచర్లలోని పొలాల వద్ద గుర్తుతెలియని వ్యక్తి (65) మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. మృతుడు నీలం రంగు ప్యాంట్, ఎరుపు రంగు చొక్కాను ధరించి ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం



ఉదయగిరి: బైక్ అదుపు తప్పడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన కావలి – ఉదయగిరి రహదారిలోని స్థానిక సబ్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని నేలటూరుకు చెందిన మేడేపల్లి రమణయ్య (40) తన బైక్‌పై కొండాపురంలో ఉన్న మిత్రుడి వద్దకు బయల్దేరాడు. ఈ క్రమంలో ఉదయగిరి శివారులోని సబ్‌స్టేషన్ దాటగానే బైక్ అదుపుతప్పి రోడ్డు మార్జిన్ కింద ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రమణయ్య అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 161
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 284
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 314
లేయర్ చికెన్	: 204

నిమ్మ ధరలు పొదలకూరు (కిలో)



పెద్దవి: రూ.65
సన్నవి: రూ.40
పండ్లు: రూ.30

రేషన్ డీలర్ల భర్తీ ఎన్నడో?

- జిల్లాలో 110కిపైగా ఖాళీలు
- మానేసి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- వీఏఓల ఆధ్వర్యంలోనే చౌకదుకాణాల నిర్వహణ
- పక్కదారి పడుతున్న పేదల బియ్యం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు



నెల్లూరు (పొగతోట): జిల్లాలో చౌకదుకాణాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో చౌకదుకాణాల డీలర్లు రిజైన్ చేసి సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు భర్తీ చేయలేదు. నిబంధనల ప్రకారం డీలర్ రిజైన్ చేస్తే ఆయా డివిజన్ల ఆర్డీఓలు మూడు నెలల్లోపు నోటిఫికేషన్ ఇచ్చి నియమించాలి. కానీ జిల్లాలో 110కిపైగా చౌకదుకాణాలకు డీలర్లను నియమించకుండా వీఏఓ, ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. దీంతో పేదల బియ్యం పక్కదారి పడుతోంది. మరోవైపు ఆయా దుకాణాల్లో రేషన్ సరుకులు సైతం సక్రమంగా పంపిణీ చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయం తెలిసినా రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు పట్టించుకోవడం లేదు. నెలనెలా లంచాలు తీసుకొని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రేషన్ బియ్యం పక్కదారి

జిల్లా వ్యాప్తంగా 1513 చౌకదుకాణాలున్నాయి. ప్రతి చౌకదుకాణ పరిధిలో డీలర్ ఆధ్వర్యంలో రేషన్ సరుకుల పంపిణీ జరుగుతుంది. సివిల్ సప్లయ్స్ గోదాముల నుంచి చౌకదుకాణాలకు వచ్చిన సరుకులను ఎండీయూ ఆపరేటర్ ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తారు. ప్రతి నెలా జిల్లాలో 10 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. రేషన్ డీలర్లు లేని చౌకదుకాణాల్లో రేషన్ పంపిణీ అస్తవ్యస్తంగా సాగుతోంది. రేషన్ బియ్యం సైతం పక్కదారి పడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నారు. కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయకుండా వారి నుంచి కొనుగోలు చేసి రైస్‌మిల్లులు, హోటళ్లకు విక్రయిస్తున్నారు. అధిక శాతం బియ్యం ఉంటే రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. తక్కువ బియ్యం ఉంటే హోటళ్లకు విక్రయిస్తున్నారు. చౌకదుకాణాల వద్ద కార్డుదారుల నుంచి కిలోను రూ.పదికి కొనుగోలు చేసి హోటళ్లకు రూ.30కు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కిలోకు రూ.45 ఖర్చు

ప్రభుత్వం ప్రతి నెలా తెల్లకార్డుదారులకు బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తోంది. ధాన్యం కొనుగోలు, మిల్లింగ్, గోదాముల నుంచి ఎమ్మెల్‌ఎస్ పాయింట్లు, చౌకదుకాణాలు, ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు పంపిణీ చేసేందుకు కిలోకు రూ.42 నుంచి రూ.45 వరకు ప్రభుత్వానికి ఖర్చవుతోంది. రేషన్ డీలర్లు, ఇన్‌చార్జి డీలర్లు, వీఏఓలు కుమ్మక్కై పేదల బియ్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మొత్తాన్ని అందరూ వాటాలు పంచుకుంటున్నారు. దొడ్డిదారిన తరలించిన బియ్యాన్ని రైస్‌మిల్లర్లు పాలిష్ పట్టి నాణ్యమైన బియ్యంలో కలిపి అధిక ధరలకు బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు. నెల్లూరు నగరం రాజుపాళెం, కోవూరు, సంగం, కావలి తదితర ప్రాంతాల్లోని రైస్‌మిల్లుల్లో పేదల బియ్యాన్ని పాలిష్ పట్టి విక్రయిస్తున్నారు. బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి పెద్ద బృందాలు ఉన్నాయి. రాత్రి 12 తర్వాత ఉదయం ఐదు గంటల్లోపు బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఆ సమయంలో అధికారుల తనిఖీలు ఉండవని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.ంగా

ఆర్డీఓలు నోటిఫికేషన్ ఇవ్వాలి

జిల్లా వ్యాప్తంగా 110కుపైగా చౌకదుకాణాల డీలర్లు మానేశారు. ఆయా చౌకదుకాణాలను వీఏఓలు, ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం. డీలర్ల భర్తీ ప్రక్రియను ఆర్డీఓలు చేపట్టాల్సి ఉంది. నోటిఫికేషన్ ఇచ్చి డీలర్లను నియమించాల్సి ఉంది. రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు చేపడతాం. సమాచారం అందితే తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం.

– వెంకటరమణ, డీఎస్‌ఓ

ఉత్తర్వుల ఉపసంహరణపై హర్షం



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

నెల్లూరు(అర్బన్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు జరగలేదనే కారణంతో స్టాఫ్ నర్సులను టర్మినేట్ చేసిన ఘటనలో తమ సంఘ ఆందోళనలను అర్థం చేసుకున్న వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు సదరు ఉత్తర్వులను ఉపసంహరించుకోవడంపై హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు నగరంలోని వైద్యశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్ల జిల్లాలోని పీహెచ్‌సీల్లో ఒక్క కాన్పు సైతం జరగలేదనే కారణంతో స్టాఫ్ నర్సులు మాణిక్యం, సువర్చల, మేరీ మమతను ఉద్యోగాల నుంచి టర్మినేట్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారని చెప్పారు. అయితే కాన్పులను ఆరోగ్యశ్రీలో చేర్చడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లను గర్భిణులు చేయించుకుంటున్నారని చెప్పారు. విషయాన్ని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ సహకారంతో ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించడంతో ఉత్తర్వులను రద్దు చేశారన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టేకు చోరీపై జోనల్ అధికారి విచారణ



పరిశీలిస్తున్న వినోద్‌కుమార్, హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్): నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శిథిలావస్థకు చేరుకున్న మలేరియా భవన పైకప్పునకు చెందిన ఖరీదైన టేకు కలప చోరీ విషయమై గుంటూరు నుంచి వచ్చిన జోనల్ మలేరియాధికారి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణను శుక్రవారం నిర్వహించారు. సంతపేటలోని మలేరియా భవనాన్ని అధికారులు పరిశీలించారు. పైకప్పు పెంకులను తొలగించి, గోడలను ధ్వంసం చేసి కొంత భాగం టేకును మాయం చేసిన విషయాన్ని వారు స్వయంగా గమనించారు. మలేరియా విభాగానికి చెందిన ఓ ఉద్యోగి తన మనుషులతో కలిసి టేకు చోరి యత్నానికి పాల్పడగా, తాము అడ్డుకున్నామని జిల్లా మలేరియాధికారి హుస్సేనమ్మ వివరించారు. అధికారులు అడ్డుకునే సరికే కొంత టేకు మాయమైందని గుర్తించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడారు. ఘటనపై విచారణ జరిపామని, సంబంధిత ఉద్యోగి ద్వారా సంజాయిషీ లేఖను రాయించుకున్నామని తెలిపారు. దీనిపై నివేదికను వైద్యశాఖ కమిషనర్‌కు అందజేయనున్నామని వెల్లడించారు. ఏడీ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తనిఖీలు



ఉదయగిరిలో స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీస్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): కౌంటింగ్ సమీపిస్తున్న తరుణంలో వాహన తనిఖీలతో పాటు కార్డన్ సెర్చ్‌ను పోలీసులు కొనసాగిస్తున్నారు. సరైన పత్రాల్లేకుండా అక్రమంగా తరలిస్తున్న బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకుంటున్నారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్లకు తరలిస్తున్నారు. బైండోవర్ల ప్రక్రియ కొనసాగుతోంది. కార్డన్ సెర్చ్‌లో భాగంగా జిల్లాలోని అల్లూరు, ఇందుకూరుపేట, సీతారామపురం, దుత్తలూరు, కలిగిరి, రాపూరు, కావలి రెండో పట్టణం, కలువాయి, ఉదయగిరి, వరికుంటపాడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల సమస్యాత్మక, శివారు ప్రాంతాల్లో తనిఖీలను స్థానిక పోలీస్ అధికారులు శుక్రవారం నిర్వహించారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కౌంటింగ్ సందర్భంగా ప్రజలందరూ సంయమనం పాటించాలని సూచించారు. సరైన రికార్డుల్లేని 60 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పత్రాలను చూపితే వాహనాలను విడుదల చేస్తామని తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

- ఇద్దరు చిన్నారులకు గాయాలు

ఉదయగిరి: పట్టణంలోని షాదీ మంజిల్ సమీపంలో పిచ్చికుక్క శుక్రవారం స్వైరవిహారం చేసి ఇద్దరు చిన్నారులను తీవ్రంగా గాయపర్చింది. షాదీమంజిల్ సమీపంలో ఆడుకుంటున్న చిన్నారులపై కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. గాయపడిన చిన్నారులను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు కుటుంబసభ్యులు తరలించారు. ఇలాంటి ఘటనలు గతంలో పలుమార్లు జరిగినా పంచాయతీ పాలకులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గుళికలు మింగి ఆత్మహత్య

సంగం: విపరీతమైన కడుపునొప్పిని భరించలేక గుళికలు సేవించి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంగం తిరుమనతిప్పలోని ఎస్సీ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన రాగి శీనయ్య (30) కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆర్నెల్ల క్రితం తీవ్రమైన కడుపునొప్పితో అనారోగ్యానికి గురయ్యారు. అప్పట్లో వైద్యశాలకు వెళ్లడంతో కొంత నయమైంది. ఈ క్రమంలో పనులు చేసుకుంటున్న శీనయ్యకు భరించలేని కడుపునొప్పి రావడంతో ఇంట్లోని గుళిక మందును సేవించారు. గమనించిన కుటుంబసభ్యులు 108లో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరుకు తరలించాలని సూచించడంతో కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సందడే.. సందడి



- రామాయపట్నం తీరానికి పోటెత్తిన భక్తజనం

ఉలవపాడు: రామాయపట్నం తీరం భక్తులతో శుక్రవారం కిటకిటలాడింది. గుడ్లూరు మండలం తెట్టులో గంధ మహోత్సవాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఉత్సవానికి భారీగా తరలివచ్చారు. అక్కడి నుంచి మండల పరిధిలోని రామాయపట్నం తీరానికి విచ్చేసి స్నానమాచరించారు. దాదాపు 40 వే ల మందికిపైగా వచ్చారని అంచనా. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రామాయపట్నం కోస్టల్ సెక్యూరిటీ స్టేషన్ సీఐ సుబ్బారావు తమ సిబ్బందితో కలిసి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఏఎస్సైలు మురళి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తారాస్థాయికి ఎండలు

ఠారెత్తిస్తున్న ఎండలు

బిట్రగుంట: రోహిణి కార్తె ప్రారంభం నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. నాలుగు రోజుల నుంచి పగలంతా వేడితో కూడిన పడమర గాలులు, సాయంత్రం ఉక్కపోతతో జనాలు ఉడికిపోతున్నారు. తీరంలో ఉక్కపోత వాతావరణం మరింత అధికంగా ఉండటంతో మత్స్యకార గ్రామాల ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతుండటంతో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు బయట తిరగాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.

ప్రసన్నాంజనేయుడికి విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామ క్షేత్ర ప్రాంగణంలో కొలువైన ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అభిషేకాలు, అర్చన, హోమాలు తదితరాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కారంపూడి శ్రీనివాసులురెడ్డి, ఉమా దంపతులు వ్యవహరించారు.

లక్ష మల్లెలార్చన నేడు

హనుమజ్జయంతిని పురస్కరించుకొని శబరి శ్రీరామక్షేత్రంలో లక్ష మల్లెలార్చనను శనివారం ఉదయం పదికి నిర్వహించనున్నారు. నగరోత్సవం, పల్లకిసేవను రాత్రి జరపనున్నారు.



విశేషాలంకారంలో ఆంజనేయుడు

పురుషామృగ వాహనంపై కామాక్షితాయి



బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవారు పురుషామృగ వాహనంపై శుక్రవారం దర్శనమిచ్చారు. విశేష పూజలను వేదపండితులు నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై కామాక్షితాయిని దర్శించుకున్నారు. ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

– కోవూరు